క్లుప్తంగా

బీడు భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా



ఎ.కొండూరు: బీడు భూములు సాగు చేసుకుంటున్న నిరుపేద దళిత రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత కొండూరుకు చెందిన దళిత రైతులు సుమారు 129 మంది 50 ఏళ్లుగా ఎ.కొండూరు రెవెన్యూ ఆర్ఎస్ నంబర్ 173లోని భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. భూమిని వెంటనే ఆన్‌లైన్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో లేక పోవడం వలన రైతు భరోసా కానీ, వ్యవసాయానికి సంబంధించిన రాయితీలు కానీ మంజూరు కావడం లేదన్నారు. కార్యక్రమంలో వేంపాటి వెంకటేశ్వరరావు, వి.సతీష్, సుజన రావు, చిన్న వెంకటేశ్వరరావు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన ఎస్టీయూ నాయకులు



మైలవరం: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలని రెడ్డిగూడెం ఎంపీడీఓ కేటీ వెంకట రమణ అన్నారు. రెడ్డిగూడెం మండలానికి బదిలీపై వచ్చిన ఆయనను రెడ్డిగూడెం ఎస్టీయూ మండల శాఖ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తమ పరిధిలోని ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతామన్నారు. ఎంఈఓ పి.రమేష్‌బాబు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి. అనిల్ కుమార్, వై.మోహనకృష్ణ పాల్గొన్నారు.

కోట మహిషమ్మ హుండీ ఆదాయం రూ. 3.11 లక్షలు

నూజివీడు: స్థానిక కోట మహిషాసురమర్దని ఆలయంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. రూ.3,11,968 ఆదాయం వచ్చిందని ఈఓ అలివేణి తెలిపారు. వీటితో పాటు చీరల వేలం ద్వారా రూ.1.06 లక్షలు, కొబ్బరి చిప్పల వేలం ద్వారా రూ.95 వేలు ఆదాయం లభించిందని చెప్పారు. దేవదాయ శాఖ గన్నవరం ఇన్‌స్పెక్టర్ కేవీ అనూరాధ పర్యవేక్షించారు.

రిటైర్డు ఉద్యోగులకు నేత్ర వైద్య పరీక్షలు

తిరువూరు: రిటైర్డు ఉద్యోగులకు నేత్ర వైద్య శిబిరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాపూజీ షెల్టర్ హోంలో బుధవారం నిర్వహించారు. తిరువూరు తాలూకా రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో విజయవాడ మ్యాక్సీ విజన్ ఆస్పత్రి వైద్యులు 100 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమున్న వారిని గుర్తించి విజయవాడ రిఫర్ చేశారు. రిటైర్డు ఉద్యోగుల సంఘాధ్యక్షుడు బల్లిపర ప్రసాద రావు, సంఘ కార్యవర్గ సభ్యులు యూవీ శేషారావు, మార్క్, మోదుగు ప్రసాద్, అయినాల వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. తిరువూరుకు చెందిన పులిపాటి మణిరాం రూ.1.27 లక్షలు, సంకా సత్యనారాయణ రూ.50,111, కంచి చిన్న అంజయ్య రూ.50,116, నాళ్లా సత్యనారాయణరావు రూ.44,445, నాళ్లా ఆంజనేయులు రూ.30 వేలు, గుండపనేని ప్రసాద్, శ్రీజ, రవితేజలు రూ.11,116, జీడిమళ్ల సత్యవతి, నాగభూషణం రూ.10,002, బడుగు వీరాంజనేయులు రూ.10,101, దొడ్డా వీరరాఘవరావు రూ.10,116, బొడ్డు అనిల్‌కుమార్ రూ.5,116 విరాళాలను ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, సంకా రాంబాబు, శ్రీనాథ్‌కు అందజేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: డీఎస్సీకి దరఖాస్తు చేసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉచిత శిక్షణ ఇస్తోందని తిరువూరు సహాయ సాంఘిక సంక్షేమాధికారి గాయత్రి తెలిపారు. శిక్షణ పొందదలచిన తిరువూరు ప్రాంత అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి మెరిట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తిగల వారు ఈ నెల 21 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్యాంకర్ నీరే దిక్కు!

- ఆరు నెలలుగా కుళాయి నీరు బంద్
- రక్షిత మంచినీటి పథకానికి అన్నీ అవాంతరాలే
- అరకొరగానే నీటి సరఫరా



కుళాయి నీరు రాకపోవడంతో ట్యాంకర్ వద్ద మంచినీరు పట్టుకుంటున్న ప్రజలు

తిరువూరు: తిరువూరు ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50 వేలకు పైగా జనాభా ఉన్న తిరువూరులో శాశ్వత మంచినీటి పథకాన్ని అమలు చేయకపోవడంతో ఏడాది పొడవునా ఇబ్బందులు తప్పట్లేదు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకర్ల ద్వారా రోజుకు 7 లక్షల లీటర్ల మంచినీటిని కుళాయిల ద్వారా అందించే అవకాశం ఉన్న కట్టలేరు పంపింగ్ స్కీం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాజుపేట, ఎస్సీ కాలనీ, బైపాస్ రోడ్డు, అప్పనాలపేట తదితర ప్రాంతాలకు రక్షిత మంచినీరందించేందుకు నగర పంచాయతీ వేసిన పైపులు తరచూ పగిలిపోవడంతో కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి.

మంచినీరు కొనుక్కోవలసిందే..

వేసవిలోనే కాక అన్ని కాలాల్లోనూ తిరువూరు పట్టణ ప్రజలు తాగునీటిని కొనుక్కోక తప్పడం లేదు. ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో 20 లీటర్ల క్యాన్ మంచినీరు రూ.15 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల వరదలు సంభవించినపుడు కట్టలేరులో పైపులు, మోటార్లు మునిగిపోవడంతో రెండు నెలల పాటు రక్షిత మంచినీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇంకా వీటి మరమ్మతు పనులు పూర్తికాకపోవడంతో కొన్ని ప్రాంతాలకే నీరందుతోంది.

ట్యాంకర్లతో నీటి సరఫరా

గతంలో వేసవిలో మూడు నెలల పాటు మాత్రమే ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయగా, ఇప్పుడు ఏడాది పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. వార్డుల్లో ప్రజలకు తాగునీరు లేకపోవడంతో ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన ట్యాంకర్లకు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని తాగునీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని 20 వార్డులకు కేవలం మూడు ట్యాంకర్లతో తాగునీరందిస్తుండటంతో వారానికి ఒక రోజు కూడా సరఫరా జరగడం లేదని పలువురు వాపోతున్నారు.

రక్షిత మంచినీటి సరఫరాను మెరుగుపరుస్తున్నాం

ఇటీవల వరదల కారణంగా నిలిచిపోయిన రక్షిత మంచినీటి సరఫరాను పునరుద్ధరించాం. రాజుపేటలోని కొన్ని ప్రాంతాలకు పైపులైన్ల లీకేజీ కారణంగా కుళాయి నీరందడం లేదు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

– లోవరాజు, నగర పంచాయతీ కమిషనర్, తిరువూరు

ట్యాంకర్లతో చాలీ చాలని నీటి సరఫరా



కట్టలేరులో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ కుళాయి నీరందించకుండా ట్యాంకర్లతో వార్డులకు మంచినీరు పంపడం శోచనీయం. రాజుపేటలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– షేక్ సుబానీ, తిరువూరు

తాగునీరు కలుషితమవుతోంది



నగర పంచాయతీ సరఫరా చేస్తున్న రక్షిత మంచి నీరు పలుచోట్ల కలుషితమవుతోంది. పైపులైన్ల లీకేజీ కారణంగా తాగునీటిలో మురుగునీరు చేరి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. లీకేజీలు సరిచేసి ప్రతి రోజూ అన్ని ప్రాంతాలకూ కుళాయి నీరందించాలి.

– మాలపాటి ఉదయ్, తిరువూరు

నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ ఆందోళన

మైలవరం: నివాసాలకు సమీపంలో మద్యం షాపు వద్దని వెల్వడం గ్రామ శివారులో నివసించే మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. మైలవరం మండలానికి నాలుగు మద్యం షాపులు కేటాయించారు. మద్యం షాపును లాటరీ పద్ధతిలో దక్కించుకున్న పాటదారులు మైలవరం మండలం వెల్వడం గ్రామం నుంచి చిన నందిగామ వెళ్లే రహదారిలో గతంలో ఉన్న మద్యం షాపును తీసుకుని కొత్త మద్యం షాపునకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సమీప నివాసాల్లోని మహిళలు అక్కడకు చేరుకుని నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. గతంలో ఇక్కడే మద్యం షాపు ఉండటంతో కొంత మంది మద్యం ప్రియులు ఇళ్లల్లోకి వచ్చి ఆడవారిని దుర్భాషలాడారని, దొంగతనాలు కూడా జరిగాయని, ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా దానిని తొలగించారని చెప్పారు. ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. పొలం పనులు చేసుకునే వారమని, ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులపై గొడవకు దిగి ఇబ్బంది పెట్టేవారని మహిళలు ఆరోపించారు.



ఆందోళన చేస్తున్న మహిళలు, స్థానికులు

స్కూల్‌కు వెళ్లే పిల్లలు ఉన్నారని, మద్యం సేవించి రోడ్డుపై అడ్డదిడ్డంగా నడుస్తూ దాడులకు దిగేవారని వారు వాపోయారు. అధికారులు స్పందించి నివాసాల మధ్య మద్యం షాపులు లేకుండా చూడాలని మహిళలు కోరారు.

- విస్సన్నపేట: రద్దీగా ఉండే ప్రాంతంలో, స్థానిక అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వవద్దని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, తిరువూరు ఎక్సైజ్ ఎస్ఐ సీపీ కుమార్‌కు వినతిపత్రాలను అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారులకు భూమి పూజ



తిరువూరురూరల్: మండలంలోని ఏడు గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కోకిలంపాడు, మల్లేల, ఆంజనేయపురం, జీ కొత్తూరు, లక్ష్మీపురం, చౌటపల్లి గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ రహదారుల నిర్మాణం చేపట్టారు. వీటికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం మేలు

చాట్రాయి: రైతులు తమ పంటల సాగులో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయాధికారి బి. శివశంకర్ అన్నారు. బుధవారం పోలవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని, భూసారం పెరిగి దిగుబడులు బాగుంటాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని ఆయన సూచించారు. పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన అవసరమని చెప్పారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



జూపూడిలో వరదలకు మొక్కజొన్న పంట నష్టపోయిన తర్వాత వేసిన మినుము పైరు



మూలపాడులో వరి నాట్లు

ఇబ్రహీంపట్నం: వరద ప్రభావిత గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. నెలన్నర కిందట కృష్ణానది, బుడమేరు వరదలకు వివిధ గ్రామాల్లో పంట పొలాలు నీటి ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో 5,700 ఎకరాల వ్యవసాయ పంటలు, 260 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కుళ్లిపోయిన పంటలను పూర్తిగా తొలగించి మరలా దుక్కులు దున్నారు. రబీ పంటలుగా మినుము, వరి, మునగ, మిర్చి, పత్తి, క్యాలీఫ్లవర్ వంటి పంటలు సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు మొక్కలను నర్సరీల నుంచి దిగుమతి చేసుకోగా, మరికొందరు పొలాల్లోనే నారు పోసుకున్నారు. మొక్కజొన్న సాగు చేసే రైతులు పొలాలు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. ఈలప్రోలు, గుంటుపల్లి గ్రామాల్లో దీపావళి వెళ్లిన తర్వాత దాళ్వా సాగుగా వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. పంటలు దెబ్బతిన్న కొంతమంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదు. దీంతో అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారు. ఇకనైనా పరిహారం అందుతుందేమోనని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నష్టపరిహారం అందలేదు

గ్రామంలో ఖరీఫ్ సాగుగా మూడెకరాల్లో వరి సాగు చేపట్టా. వరద వచ్చినప్పటికి సుమారు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టా. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. మరలా వ్యవసాయం చేసేందుకు బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– జొన్నలగడ్డ సాంబశివరావు, రైతు, మూలపాడు

లక్ష్యాల సాధనతోనే ప్రగతి

మైలవరం: ప్రతిఒక్కరూ స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని సాధించడం ద్వారానే పురోగతి సాధ్యమని విజయవాడ స్పార్క్ సైకాలజీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రతినిధి అన్నపురెడ్డి కోటిరెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డాటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అతిథి ఉపన్యాసం ఇచ్చారు. కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలని, ప్రేరేపించాలని చెప్పారు. ఒత్తిడిని తగ్గించేందుకు, శక్తి స్థాయిలను పెంచేందుకు వ్యాయామం, ధ్యానం, తగినంత నిద్ర వంటి స్వీయ సంరక్షణ కార్యకలాపాలను సాధన చేయాలన్నారు. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బా రావును ఉదాహరణగా చెప్పారు. సోలేటీ సీఈఓ శ్రీక్రాంత్ కిరణ్, డాక్టర్ బీడీసీఎస్ ప్రసాద్, ప్రొఫెసర్స్ సాని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు అవగాహన

ఆగిరిపల్లి: వాహన చోదకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ కూడలి వద్ద బుధవారం వాహన చోదకులకు హెల్మెట్ వాడకం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అనుమతులు లేకుండా స్థూపం నిర్మాణం

నూజివీడు: మున్సిపాలిటీ నుంచి, కలెక్టర్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే బస్టాండ్ వద్ద గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు స్థూపం నిర్మించారు. గత నెలలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పట్టణంలో ఎన్టీఆర్, వైఎస్సార్, ఎమ్మార్ అప్పారావు విగ్రహాలను ఏర్పాటు చేయాలని అజెండాలో ప్రతిపాదించారు. టీపీఓ, మున్సిపల్ కమిషనర్లు దానికి బదులిస్తూ ఆర్అండ్‌బీ రోడ్ల మార్జిన్‌లో లేదా రోడ్డు సెంటర్‌లో, సర్కిల్‌లో విగ్రహాలను నెలకొల్పవద్దని, దీనిపై సుప్రీం కోర్టు ఉత్తర్వులున్నాయంటూ విగ్రహాల ఏర్పాటుకు నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయని పేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌కు అడ్డంగా ఆర్అండ్‌బీ మార్జిన్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తుంటే మున్సిపల్ కమిషనర్ ఎందుకు అడ్డుకోవడం లేదని పలు రాజకీయ పక్షాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలన్నీ అందరికీ ఒకే విధంగా అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ టీపీఓ కె. వెంకటేశ్వరరావును వివరణ కోరగా నిర్మాణ పనులను నిలిపివేయాలని సంబంధిత వ్యక్తులకు సూచించామని చెప్పారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.



నూజివీడు బస్టాండు వద్ద ఆర్అండ్‌బీ రహదారి మార్జిన్‌లో నిర్మించిన స్థూపం

18 నుంచి రెవెన్యూ సభలు

చాట్రాయి: రెవెన్యూ గ్రామ సభలు మండలంలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 18న పర్వతాపురం, 19న పోతనపల్లి, 22న బూరుగుగూడెం, 23న కొత్తగూడెం, 24 చిత్తపూరులో గ్రామ సభలు జరుగుతాయని వివరించారు.

- నూజివీడు: మండలంలో రీసర్వే పూర్తయిన 11 గ్రామాల్లో రీసర్వే సమస్యలపై ఈనెల 18 నుంచి నవంబర్ 2 వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ బీవీ సుబ్బారావు బుధవారం తెలిపారు. 18న రావిచర్ల, 19న బోర్వంచ, 22న రామన్నగూడెం, 23న పోలసానపల్లి, 24న మొర్సపూడి, 25న దేవరగుంట, 26న వేంపాడు, 29న గొల్లపల్లి, 30న ఎంఎన్‌పాలెం, నవంబర్ 1న మర్రిబంధం, 2న సీతారామపురంలో గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మరమ్మతుల నేపథ్యంలో గొల్లపూడి సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి. రవీంద్రబాబు తెలిపారు. శ్రీనివాస నగర్, సిద్ధార్థ నగర్, కోయ పేట ఏరియాలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

సీఎం హామీ ఇచ్చినా.. అందని పరిహారం

వరద బాధితుల ఆందోళన



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఇబ్రహీంపట్నం: వరద బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాలని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లును మూలపాడు బీసీ కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ ఇటీవల కృష్ణానది వరద ప్రవాహం బీసీ కాలనీని ముంచెత్తిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధరాత్రి మా కాలనీని సందర్శించి ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు నీటి ముంపునకు గురైన 168 మంది కాలనీ కుటుంబాలకు పరిహారం చెల్లించకుండా మొండి చెయ్యి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు హామీకే విలువలేకుండా పోయిందని వాపోయారు. అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరారు. కూటమి నాయకులే దగ్గరుండి తహసీల్దార్‌కు బాధితుల ద్వారా వినతిపత్రం ఇప్పించడం గమనార్హం. కార్యక్రమంలో కూటమి నాయకులు గరికపాటి శివ, గంజి చిరంజీవి, బాధితులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

ఎంపీపీ కొండా దుర్గాభవాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

ముసునూరు: ప్రజా సమస్యలు, ప్రజాప్రతినిధుల పట్ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ, వైస్ ఎంపీపీ రాజానాయన, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సర్వసభ్య సమావేశాల్లో తీర్మానించిన అంశాలను, పనులను పూర్తి చేయలేదని, వాటిపై వివరణ కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలకు, పల్లె పండుగ, జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్‌పై అధికారులు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడం లేదని పలువురు ఆరోపించారు. సర్పంచ్‌లను సైతం గ్రామ సభలకు ఆహ్వానించడం లేదని ధ్వజమెత్తారు. గత మూడు సర్వసభ్య సమావేశాల్లో నూజివీడు నుంచి చింతలవల్లి, లోపూడి, యడవల్లి, ఎర్రంపల్లి మీదుగా దగ్గరి మార్గంలో చింతలపూడికి, రమణక్కపేట నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినా చర్యలు చేపట్టలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు తమ తమ శాఖల పనితీరు, ప్రణాళికలను వివరించారు. రమణక్కపేట వైద్యాధికారి కరీముల్లా ఆరోగ్య అంశాలు వివరించారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యాల కల్పనకు సమగ్ర కృషి చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఆర్. కృష్ణకుమారి, తహసీల్దార్ పురుషోత్తమ శర్మ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పట్టించుకోని అధికారులు



ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్

మైలవరం: మైలవరంలోని బుడమేరు వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇళ్ల నిర్మాణాలు, వివిధ అభివృద్ధి పనులు, ఆలయాల నిర్మాణాల పేరుతో కొంతమంది అధికారుల నుంచి నామమాత్రంగా ట్రాక్టర్లకు అనుమతులు తీసుకుని వందల ట్రిప్పులు ఇసుక తోలుతూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగులో నుంచి ఇసుక లోడు చేసిన ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇళ్లు కట్టుకునే వారికి ఇసుక ఉచితం అని ప్రభుత్వం చెబుతున్నా రవాణా పేరుతో వినియోగదారుల నుంచి ముక్కుపిండి సొమ్ములు వసూలు చేస్తున్నారు. పోలీసులు మాత్రం అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతూ ప్రకటనలకే పరిమితమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.

తిరుపతిని మద్యం కేంద్రంగా మార్చారు

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పవన్ కుమార్ ధ్వజం

నూజివీడు: అంతర్జాతీయ స్థాయిలో పుణ్యక్షేత్రంగా ఖ్యాతి పొందిన తిరుపతిని కూడా కూటమి ప్రభుత్వం మద్యం కేంద్రంగా మార్చిందని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్ కుమార్ ధ్వజమెత్తారు. నూజివీడులో బుధవారం ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం అంటూ హడావుడి చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, తిరుపతి జిల్లాలో 227 మద్యం దుకాణాలకు గేట్లు తెరవడం వెనక అర్థం ఏమిటో చెప్పాలన్నారు. ఎన్నికలకు ముందు 33 వేల మంది మహిళల ఆచూకీ లేదని గగ్గోలు పెట్టిన పవన్ కల్యాణ్‌కు మద్యం మహమ్మారితో ఎందరో మహిళల తాళిబొట్లు తెగనున్నాయో తెలియదా అని ప్రశ్నించారు. నాడు ప్రచారం చేసిన 33 వేల మంది మహిళల ఆచూకీ పవన్ కల్యాణ్ ఎప్పుడు కనిపెడతారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. ఇంతటి దారుణమైన పరిపాలన మునుపెన్నడూ చూడలేదని చెప్పారు. ఎటు చూసినా అధికార దుర్వినియోగం, అవినీతి, బంధుప్రీతి, అక్రమాలు, అవకతవకలే కనిపిస్తున్నాయన్నారు. హిందూ ధర్మాన్ని, సంప్రదాయాన్ని, ఆధ్యాత్మిక నగరాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపై ఉందని చెప్పారు. హిందూ ధర్మ పరిషత్ సభ్యులంతా ఏకమై మద్యం మహమ్మారిపై నేటి పాలకులను నిలదీయాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోండి

ఇబ్రహీంపట్నం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లుగా పట్టభద్రులు నమోదు చేసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాల అధ్యాపకులకు ఓటర్ల నమోదు ఫారం 18 పత్రాలను ప్రిన్సిపాల్ సాధిక్‌కు బుధవారం అందజేసి ఆయన మాట్లాడారు. డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద ప్రతి రోజూ ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు.

కాంగ్రెస్ అనుబంధ కమిటీలు రద్దు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, కమిటీలు రద్దు అయినట్లు డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ తెలిపారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు జిల్లా, మండల, గ్రామ స్థాయి పార్టీ కమిటీలు పూర్తిగా రద్దు అయినట్లు పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర అధ్యక్షురాలి సూచనల మేరకు అన్ని విభాగాలకు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి నుంచి తోటపల్లి వరకు అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతల పూడ్చివేత కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. రోడ్ల మరమ్మతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు పనులు నిలిపివేశారు. ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

పాడి రైతులతో సమావేశం

చాట్రాయి: పాడి రైతులు అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను వినియోగించుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం తుమ్మగూడెంలో పాల ఉత్పత్తిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, పాల ఉత్పత్తిని పెంచేందుకు మినరల్ మిక్చర్ అందించాలని సూచించారు. తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి. సాంబశివమూర్తి పాల్గొన్నారు.